## క్లుప్తంగా

### రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ

**రైల్వేకోడూరు అర్బన్ :** రాష్ట్రంలోని రైతులకు వైఎస్సార్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉంటారని, కేసులకు భయపడేది లేదని గురువారం పార్టీ అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ నెల 13న (నేడు) ఉదయం 10 గంటలకు రాయచోటి కలెక్టరేట్ వద్ద జరిగే నిరసన, కలెక్టర్‌కు వినతి పత్రం అందించే కార్యక్రమానికి నియోజకవర్గంలోని, కార్యకర్తలు, నాయకులు, ప్రజా ప్రతినిధులు ప్రతి ఒక్కరూ హాజరై రైతులకు అండగా నిలవాలని తెలియజేశారు. కూటమి ప్రభుత్వం రైతులకు చేస్తున్న మోసాలను ఎండ కడతామని తెలిపారు.

### ఘనంగా హజరత్ ఖాదర్ వలీ దర్గా ఉరుసు



దర్గాలో నాత్-ఏ-షరీఫ్ నిర్వహిస్తున్న దృశ్యం

**సిద్దవటం :** మండల కేంద్రంలోని బేల్దారు వీధిలో వెలసిన హజరత్ ఖాదర్‌వలీ ఉరుసు మహోత్సవం గురువారం రాత్రి ఘనంగా జరిగింది. ఉరుసు మహోత్సవం సందర్భంగా హజరత్ ఖాదర్‌వలీ దర్గాలో నాత్-ఏ-షరీఫ్ పఠించారు. భక్తులు దర్గాలో కొబ్బరికాయలు కొట్టి బూంది తెచ్చి ఫతేహా నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు దర్గా వద్దకు వచ్చిన వారికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

### ఉచిత వివాహం జరిపించిన ఆకేపాటి



నూతన వధూవరులతో ఆకేపాటి సోదరులు

**రాజంపేట టౌన్ :** ఆకేపాడులోని దేవాలయాల సముదాయంలో గురువారం ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి ఓ నిరుపేద జంటకు ఉచితంగా వివాహం జరిపించారు. నందలూరు మండలం నల్లతిమ్మాయిపల్లెకు చెందిన సుబ్బరాయుడు, లక్ష్మీదేవి దంపతుల కుమారుడైన రవికుమార్‌కు, సిద్దవటం మండలం కమ్మనాయనపల్లెకు చెందిన ఎల్లయ్య, లక్ష్మీదేవి కుమార్తె ఆదిలక్ష్మికి ఎమ్మెల్యే తాళిబొట్టు ఇచ్చి వివాహాన్ని జరిపించారు. వివాహానికి హాజరైన బంధువులకు ఎమ్మెల్యే అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు. అల్పాహారాన్ని ఎమ్మెల్యే ఆయన సోదరుడు ఆకేపాటి అనిల్ కుమార్‌రెడ్డి స్వయంగా వడ్డించారు.

### ప్రతి అర్జీకి పరిష్కారం చూపుతాం



సుండుపల్లె: ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న రెవెన్యూ అధికారులు

**సుండుపల్లె :** మండలంలోని మాచి రెడ్డిగారిపల్లి గ్రామ పంచాయతీలో గ్రామ రెవెన్యూ సదస్సును మండల ప్రత్యేక అధికారి జయరాముడు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ రెడ్డన్న మాట్లాడుతూ మండలంలోని రైతులు రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని రైతులకు ఉన్నటువంటి సమస్యలను అర్జీ మూలకంగా తెలియజేయాలన్నారు. అర్జీలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని వారు తెలియజేశారు. గ్రామ సభకు 72 అర్జీలు వచ్చాయని తెలియజేశారు.

**పుల్లంపేట :** వెంకటంపల్లిలోని నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 30 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ అరవింద కిషోర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చిన అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేశామన్నారు. ప్రతి అర్జీకి త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. అర్జీల పరిష్కారానికి 45 రోజుల గరిష్ఠ పరిమితి ఉంటుందని తెలియజేశారు.

### రెవెన్యూ సదస్సుకు 15 అర్జీలు



అర్జీలను స్వీకరిస్తున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ మాధవీలత

**సిద్దవటం :** రైతుల భూ సమస్యల పరిష్కారానికి గ్రామ రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని ఇన్‌చార్జి తహసీల్దార్‌త మాధవీలత తెలిపారు. సిద్దవటం మండలంలోని లింగంపల్లె, కడపాయపల్లె గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో భూ సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. ఈ మేరకు రెండు గ్రామాలకు చెందిన 15 మంది రైతులు తమ అర్జీలను అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో సర్వేయర్ సుదర్శన్, వీఆర్‌ఓ, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# భూ ఆక్రమణల కథ షెడ్డుకేనా?

- గాలివీడు నాలుగు రోడ్ల కూడలిలో ప్రభుత్వ స్థలం ఆక్రమణలు
- ఆక్రమణదారులపై చర్యలకు వెనుకాడుతున్న రెవెన్యూ యంత్రాంగం
- రాజకీయ పెద్దల అండదండలతోనే ఆక్రమణలంటూ స్థానికుల ఆరోపణ



గాలివీడు నాలుగు రోడ్ల కూడలిలో ఆక్రమణకు గురైన ఆర్ అండ్ బీ స్థలం

**గాలివీడు :** పట్టణంలోని గేటు నాలుగురోడ్ల కూడలిలో కోట్లు విలువచేసే ఆర్‌అండ్‌బీ స్థలం ఆక్రమణలకు వత్తాసు పలుకుతున్నారన్న చర్చ మండల కేంద్రంలో జోరుగా సాగుతోంది. ఆక్రమణలను అడ్డుకోవాల్సిన అధికారులే ఇలా నోటీసులతో సరిపెట్టి, చర్యలకు వెనుకాడుతుండటంతో మండల కేంద్రంలో జరుగుతున్న చర్చకు బలం చేకూరుస్తోంది. గాలివీడు నడిబొడ్డులో నాలుగురోడ్ల కూడలిలో సర్వే నంబర్ 2266 లో 1.80 ఎకరాల భూమి ఉంది. దీని విలువ రూ.కోట్లలో ఉంటుంది. కబ్జాకు గురైన స్థలంలో రోడ్డు విస్తరణ కోసం తొలగించిన స్థలంతోపాటు బస్ షెల్టర్ జాగా.. మొత్తం ఆక్రమార్కుల పాలైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థలం ఆక్రమించారన్న సమాచారం అధికారులకు చేరడంతో వారు కేవలం నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకున్నారు.

అధికారుల అలసత్వమా.. రాజకీయ పెద్దల అండదండల కారణంగా అధికారులు సైతం ఆక్రమణదారులకు వత్తాసు పలుకుతున్నారన్న వాదన విమర్శలకు తావిస్తోంది.

**నాలుగు రోడ్ల కూడలి కనుమరుగు**

ఓ వైపు ఆక్రమణలతో ఆర్ అండ్ బీ స్థలంలో పెద్దఎత్తున రేకుల షెడ్లను ఏర్పాటు చెయ్యగా, మరోవైపు చికెన్ సెంటర్లు, తోపుడు బండ్లతో నాలుగు రోడ్ల కూడలి కనుమరుగైంది. మరోవైపు మహాత్మ గాంధీ విగ్రహం కనబడకుండా చుట్టూ చికెన్ సెంటర్లతో ఏర్పాటు చేయడం వివాదాస్పదంగా మారింది.

**నాడు షెడ్లు.. నేడు దుకాణాలు**

గేటు నాలుగు రోడ్ల కూడలి ఆక్రమణలకు అడ్డాగా మారిపోయింది. చాలా కాలంగా ఈ ప్రాంతంలో ప్రభుత్వ స్థలాలను టార్గెట్ చేసుకుని ముందు రేకుల షెడ్లను పెట్టడం, తరువాత అందులో దుకాణాలను ఏర్పాటు చెయ్యడం, తదుపరి కొన్ని రోజుల తరువాత పక్కా గృహాలను నిర్మించుకోవడం పరిపాటిగా మారిపోయింది. ఏది ఏమైనా రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా ఆక్రమణదారులపై కఠినంగా వ్యవహరించి కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ జాగా అధికారులు కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

**రేకుల షెడ్లను తొలగిస్తాం**

ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి 15 రోజుల గడువు ముగిసింది. ప్రస్తుతం రెవెన్యూ సదస్సులు జరుగుతున్నందున రేకుల షెడ్లు తొలగింపు కుదరలేదు. త్వరలోనే ఆక్రమణలు తప్పకుండా తొలగిస్తాం.

– భాగ్యలత, తహసీల్దార్, గాలివీడు

### సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా పనిచేద్దాం

**రైల్వేకోడూరు అర్బన్ :** మండలంలోని గ్రామ సచివాలయాలలో పని చేసే అధికారులు, సిబ్బంది గ్రామాలలో సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా విధులు నిర్వర్తించాలని గురువారం ఎంపీడీఓ నాగార్జున తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని వెలుగు సభా భవనంలో రెండు రోజుల శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో నీరు, పరిశుభ్రత, పచ్చదనం, మౌలిక వసతులు, సామాజిక భద్రత, బాల్య వివాహాల అరికట్టడం ఇలాంటి 9 అంశాలలో ప్రతి గ్రామం ముందుండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వసుంధర, ఏఓ చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

**చిన్నమండెం :** మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ సభా భవనంలో సర్పంచులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బందికి గురువారం శిక్షణా తరగతులు ప్రారంభమైనట్లు ఎంపీడీఓ శేఖర్ నాయక్ తెలిపారు. స్థానికీకరణ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు(ఎల్ఎస్‌డీజీ)పై గురు, శుక్రవారాలలో మండల స్థాయి శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణాధికారి, అన్ని సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

**సిద్దవటం :** గ్రామాల సుస్థిరాభివృద్ధిపై శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఇన్‌చార్జి ఎంపీడీఓ మెహతాజ్ యాస్మిన్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలోని సభా భవనంలో రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సైంటిఫికల్ ఎక్స్‌పోను విజయవంతం చేయండి



చిన్నమండెం: మల్లూరు జెడ్పీహెచ్ఎస్‌లో ఎక్స్‌పో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న టీచర్లు

**చిన్నమండెం/సంబేపల్లె :** జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు ఈ నెల 27, 28వ తేదీలలో రాయచోటిలోని సందీప్ హైస్కూల్‌లో నిర్వహించబోయే కలామ్స్ విజన్ – 2024 సైంటిఫికల్ ప్రాజెక్ట్ ఎక్స్‌పోను విజయవంతం చేయాలని ప్రధానోపాధ్యాయులు బి.రెడ్డన్న, ప్రాజెక్టు డైరెక్టర్ వినయ్‌కుమార్ కోరారు. గురువారం మండల పరిధిలోని మల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రోగ్రాం డైరెక్టర్ వినయ్‌కుమార్ రూపొందించిన కలాం విజన్ సైంటిఫికల్ ఎక్స్‌ప్రో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఎక్స్‌పోలో రిజిస్ట్రేషన్‌కు 62814 53550, 93919 32752 నెంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు రెడ్డిముని, సుధాకర్, వెంకటరమణ, శ్రీనివాసులు, మోహన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సంబేపల్లెలోని జెడ్పీహెచ్ఎస్‌లో హెచ్‌ఎం నరసింహారెడ్డితో పాటు ఉపాధ్యాయులు పోస్టర్‌లను ఆవిష్కరించారు.

## 15న 'చట్టం అందరికీ సమానం'పై చర్చా వేదిక



కరపత్రాలను విడుదల చేస్తున్న ప్రజా సంఘాల నేతలు

**రాయచోటి టౌన్ :** ఈ నెల 15న కడపలోని హరిత హోటల్‌లో చట్టం అందరికీ సమానమేనా అనే అంశంపై పౌర హక్కుల సంఘం ఆధ్వర్యంలో చర్చా వేదిక నిర్వహిస్తున్నట్లు ప్రజాసంఘాల నాయకులు తెలిపారు. గురువారం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను కొత్తపేటలోని వామపక్ష కార్యాలయంలో విడుదల చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మానవహక్కుల ఉద్యమకారుడు, ప్రొఫెసర్ జి.హరగోపాల్ పాల్గొంటారన్నారు. ఇందులో ప్రజాసంఘాల నాయకులు, ప్రజాస్వామ్యవాదులు, ప్రజలు విశేషంగా హాజరవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రవిశంకర్‌రెడ్డి, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ (రిటైర్డ్) జి. గోపాల్, ట్రాన్స్‌కో ఇంజనీర్ (రిటైర్డ్) ఐ.గురప్ప, పౌరహక్కుల సంఘం రాష్ట్ర నాయకులు సి.వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు పి.రెడ్డెయ్య, ఎం.రవిశంకర్, వంగిమళ్ల రమణ, చైతన్య మహిళ సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.ఝాన్సీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభకు అంగవైకల్యం అడ్డుకాదు



రాజంపేట టౌన్: విభిన్న ప్రతిభావంతుడికి పురస్కారం అందజేస్తున్న ప్రతినిధులు



రైల్వేకోడూరు అర్బన్: పురస్కారం అందుకుంటున్న పార్థసారథి

**రాజంపేట టౌన్ :** ప్రతిభకు అంగవైకల్యం అడ్డుకాదని రాజంపేట, పుల్లంపేట మండలాల ఎంఈఓలు కొండూరు రఘునాథరాజు, జి.చక్రధర్‌రాజు తెలిపారు. పట్టణంలోని న్యూ ఆంధ్ర కల్యాణ మండపంలో విభిన్న ప్రతిభావంతుల సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారికి, అంగవైకల్యాన్ని జయించి సమాజంలో రాణిస్తున్న విభిన్న ప్రతిభావంతులకు అన్నమయ్య సేవా పురస్కార్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి రాజంపేట, పుల్లంపేట మండలాల ఎంఈఓలు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. అంగవైకల్యం శరీరానికే కాని మనస్సుకు కాదన్నారు. అందువల్లే పట్టణంలోని దివ్యాంగులు విభిన్న ప్రతిభావంతులను, సేవారంగంలో ముందున్న వారిని గుర్తించి పురస్కారాలు అందజేయడం ఎంతైనా అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమాన్ని విభిన్న ప్రతిభావంతుల సేవాసంఘం ప్రతినిధులు సుబ్బారెడ్డి, అబ్దుల్‌ఖాదర్ తమ భుజస్కంధాలపై వేసుకొని విజయవంతం చేయడం గొప్ప విషయమని తెలిపారు. ఇందులో విజన్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పోతుగుంట రమేష్‌నాయుడు, ఆ సంఘం ప్రతినిధులు సుబ్బారెడ్డి, అబ్దుల్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

**సారథికి సేవారత్న అవార్డు**

**రైల్వేకోడూరు అర్బన్ :** రైల్వేకోడూరు గ్లోబల్ ట్రస్టు చైర్మన్ పార్థసారథికి గురువారం విభిన్న ప్రతిభావంతుల సంఘం ఆధ్వర్యంలో రాజంపేటలో జరిగిన ఓ కార్యక్రమంలో సేవారత్న అవార్డును అందించారు. తన సేవలను గుర్తించి పురస్కారం అందించడం తనపై బాధ్యతను మరింత పెంచిందన్నారు. ఈ కార్యక్రమంలో అతికారి క్రిష్ణయ్య, రమేష్‌నాయుడు, ఎంఈఓలు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

## అల్పపీడన ప్రభావంతో ఎడతెరిపిలేని వర్షాలు



ఓబులవారిపల్లెలో కురుస్తున్న వర్షం



సుండుపల్లె: చెరువును తలపిస్తున్న వర్షపునీరు

**ఓబులవారిపల్లె :** మండల వ్యాప్తంగా గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా ఓ మోస్తరు భారీ వర్షం కురిసింది. ఇటీవల ఫెంగల్ తూపాను కారణంగా భారీ వర్షలు కురిశాయి. దానిని మరువక ముందే ప్రస్తుతం బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా వర్షలు కురుస్తున్నాయి. భారీ వర్షలకు లోతట్టు ప్రాంతల్లో వర్షపు నీరు చేరింది. మండలంలో 54 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు డీటీ రెడ్డిప్రసాద్ తెలిపారు.

**సుండుపల్లె :** అల్పపీడన ప్రభావంతో గురువారం ఉదయం నుంచి మండలంలో వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి మండల కేంద్రంలోని కెనరా బ్యాంకు వద్ద ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపునీరు చెరువును తలపించింది. దీంతో పలువురు వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

## వర్షంలోను వడివడిగా సాగిన పాదయాత్ర

**ఎమ్మెల్యే ఆకేపాటి ఒంటిమిట్ట పాదయాత్రకు దారిపొడవునా జననీరాజనాలు**



రాజంపేట టౌన్: వర్షంలోను కొనసాగుతున్న ఆకేపాటి పాదయాత్ర

**రాజంపేట టౌన్ :** రెండవ భద్రాద్రిగా ప్రసిద్ధిగాంచిన ఒంటిమిట్ట రాములోరిని ప్రతి ఏడాదిలాగే పాదయాత్ర ద్వారా దర్శించుకోవాలన్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి సంకల్పం ముందు వర్షం కూడా చిన్నబోయింది. మండలంలోని ఆకేపాడులో ఉన్న దేవాలయాల సముదాయం నుంచి గురువారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో ఎమ్మెల్యే పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. తొలుత ఆకేపాడులో ఉన్న ఆలయాల సముదాయంలో దేవతామూర్తులకు అమర్‌నాథరెడ్డి ప్రత్యేక పూజలు చేసి పాదయాత్ర ప్రారంభించారు. అయితే పాదయాత్ర ఆకేపాడు క్రాస్‌రోడ్డుకు చేరుకున్నప్పటి నుంచి వర్షం మొదలైంది. అయినా విరామం తీసుకోకుండా పాదయాత్రను కొనసాగించారు. దారి వెంబడి ఆకేపాటికి జనం నీరాజనం పట్టారు. అనేక చోట్ల మహిళలు హారతులు ఇచ్చి వారి గ్రామాల్లోకి స్వాగతం పలికారు. దీంతో పాదయాత్ర సాగే గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొనడంతోపాటు ఆధ్యాత్మికత నెలకొంది. ఏది ఏమైనా జోరు వర్షాన్ని సైతం లెక్క చేయకుండా పాదయాత్రతో కోదండరాముడిని దర్శించుకోవాలన్న ఎమ్మెల్యే సంకల్పం గురించి నియోజకవర్గ ప్రజలు చర్చించుకుంటున్నారు. పాదయాత్ర ప్రారంభానికి ముందు ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. లోక కల్యాణం కోసమే ప్రతి ఏడాది తాను పాదయాత్ర ద్వారా వెళ్లి తిరుమలలోని శ్రీ వేంకటేశ్వరుడిని, ఒంటిమిట్టలోని కోదండరాముడిని దర్శించుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసి ప్రజలకు సుఖసంతోషాలు కల్పించాలని స్వామివార్లను వేడుకుంటానన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలన్నదే తన ఆకాంక్ష అని తెలిపారు.

**సిద్దవటం నాయకుల సంఘీభావం**

**సిద్దవటం :** రాజంపేట ఎమ్మెల్యే, వైఎస్ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి గురువారం చేపట్టిన ఒంటిమిట్ట పాదయాత్రకు వైఎస్ఆర్‌సీపీ సిద్దవటం మండల నాయకులు పూలమాలలు వేసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి ఆకేపాటి గ్రామం లోని దేవాలయాల వద్ద నుంచి ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామి ఆలయం వరకు చేపట్టిన మహా పాదయాత్ర ఒంటిమిట్ట మండల శివారులోని ఆంజనేయస్వామి ఆలయం వద్దకు రాగానే అక్కడ ఆకేపాటికి పూలమాలలు వేసి పాదయాత్రకు సంఘీభావాన్ని తెలిపి, ఆయనతో పాటు మహాపాదయాత్రలో పాల్గొని ఒంటిమిట్ట శ్రీకోదండ రామస్వామి ఆలయం వరకు నడిచారు.

**నందలూరులో..**

**నందలూరు :** ఒంటిమిట్ట కోదండ రామాలయానికి పాదయాత్రగా వెళ్తున్న రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి గురువారం నందలూరుకు చేరుకోవడంతో నందలూరు వైఎస్సార్‌సీపీ నాయకులు బాణసంచా పేల్చుతూ, పూలమాల, శాలువాతో ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి, భూమన శివశంకర్ రెడ్డి, గొబ్బిళ్ల త్రినాథ్, గడికోట వెంకటసుబ్బారెడ్డి, అరిగె హరిబాబు, అరిగెల సౌమిత్రి, గుండు మల్లికార్జున రెడ్డి, ఆకేపాటి జగదీశ్వర్ రెడ్డి, గంప సుధాకర్, శ్రీనివాసరాజు, పల్లె గ్రీష్మంత్ రెడ్డి, పల్లె మాధవి, ఆనాల మధు యాదవ్, మధురాజు, చుక్క వెంకటేష్, మాబాషా, ఉప సర్పంచ్ ఇబ్బు, బ్యాంకు నారాయణ, నరసారెడ్డి, మోడపోతుల సుధాకర్, ఎముక దుర్గయ్య, సోమిశెట్టి ప్రభాకర్, కాకి చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.



సిద్దవటం: ఆకేపాటికి సంఘీబావం తెలిపిన మండల నాయకులు



నందలూరు: ఆకేపాటికి ఘనస్వాగతం పలుకుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

### ప్రైవేటు ఆసుపత్రుల తనిఖీ

**మదనపల్లె:** పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రిలను జిల్లా ఏడీఎంహెచ్ఓ డాక్టర్ శైలజ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రులతో పాటు , స్కాన్ సెంటర్లు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలోని టీబీ, ఎచ్.ఐ.వి, బ్లడ్ బ్యాంక్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖ ఆదేశాలతో పట్టణం లో వివిధ ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రులతో పాటు స్కాన్ సెంటర్లను తనిఖీ చేశామన్నారు. ఈ సందర్భంగా సంబంధిత సిబ్బంది కి తగు సలహాలు సూచనలు ఇచ్చామన్నారు. ప్రతి ఆసుపత్రిలో బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహణలో ప్రమాణాలు పాటించాలన్నారు.

### ఎస్సీ, ఎస్టీ చట్టం బలోపేతం చేయాలి

**కడప సెవెన్‌రోడ్స్:** ఎస్సీ ఉప కులాలకు క్రిమిలేయర్ విధానం వర్తింపజేయకుండా, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని బలోపేతం చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దళిత ఫోరం నేత బూషిపాటి కిషోర్ కుమార్ విన్నవించారు. తాడేపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ దళిత వ్యతిరేక విధానాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ ఎస్టీలను ప్రమాదంలోకి నెట్టేస్తున్నాయన్నారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటి చట్టాన్ని గత పాలకులు తీసుకువస్తే, ఇప్పుడు ఆ చట్టం స్వరూపమే మార్చివేశారన్నారు. చట్టాన్ని కాపాడుకోకపోతే దళితులకు రక్షణే ఉండదని, రాజకీయ ప్రలోభాలకు గురవకుండా చట్టం పరిరక్షణకు మద్దతునివ్వాలని కోరారు. క్రిమీలేయర్‌తో రిజర్వ్‌డ్ పోస్టులను భర్తీ చేయకుండా వదిలివేసే ప్రమాదం ఉందన్నారు. ఈ వినతికి స్పందించిన జగన్మోహన్‌రెడ్డి తప్పక దళితులకు మద్దతుగా ఉంటామని, క్రిమిలేయర్ విధానాన్ని అడ్డుకుంటామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

## జీతాలు లేవు.. అరియర్స్‌తో బతుకుతున్నాం

**సిద్దవటం :** 1990లో ఎయిడెడ్ పాఠశాలలో చేరిన ఉపాధ్యాయులకు ఇప్పటి వరకు జీతాలు మంజూరు చేయలేదని కేవలం అరియర్స్ మాత్రమే చెల్లిస్తున్నారని సిద్దవటం మండలం పార్వతీపురంలోని ఎస్వీ బీవీడీ సభా హైస్కూల్ కరస్పాండెంట్ ఎం.డి. మధుసూదన్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో ఆయన మాట్లాడుతూ గ్రాంట్ ఇన్ ఎయిడెడ్ పోస్టుల అడ్మిషన్ అయిన ఉపాధ్యాయులకు 1990 నుంచి 1999 వరకు అరియర్స్ బకాయిలు ఇచ్చారని, జీతాలు మాత్రం చెల్లించలేదన్నారు. ఇప్పటికీ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారని, వారికి రిటైర్‌మెంటు వయస్సు కూడా దగ్గరలోనే ఉందని, అయినా జీతాలు ఇవ్వకుంటే ఎలా అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా సమాధానం లేదని దీంతో కోర్టును ఆశ్రయించామన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఎయిడెడ్ ఉపాధ్యాయుల పట్ల సానుకూలంగా స్పందించి జీతాలను మంజూరు చేయాలని ఆయన కోరారు.

## విపత్తుల నిర్వహణపై ప్రజలకు అవగాహన ఉండాలి



మాక్ డ్రిల్ చేస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది

**గాలివీడు :** విపత్తుల నిర్వహణపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ భాగ్యలత పేర్కొన్నారు. గురువారం స్థానిక వెలిగల్లు జలాశయంలో 10వ ఎన్డీఆర్ఎఫ్ బెటాలియన్ కమాండెంట్ ఆధ్వర్యంలో విపత్తుల సన్నద్ధతపై మాక్ ఎక్సర్సైజ్ (డ్రిల్) నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు, విద్యార్థులు, అధికారులు తిలకించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కలిగించామన్నారు. నదీ పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు, అధిక గాలులు, తుపానులు వంటి విపత్కర పరిస్థితుల వలన జలాశయంలో నీటి మట్టం పెరగడం, తీరం వెంబడి తుపాను ప్రభావంతో విపత్తులు ఎదురైనప్పుడు ఎలా ఎదుర్కోవాలో ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. వరదల సమయంలో బాధితులకు సహాయం చేయడానికి మత్స్య శాఖ గజ ఈతగాళ్లతో పాటు లైఫ్ జాకెట్లు, నాటు పడవలతో ఎలా రక్షిస్తారో వివరించారు. కార్యక్రమంలో వెలిగల్లు ప్రాజక్ట్ అధికారులు ఈఈ శ్రీనివాస్ రెడ్డి, డీఈఈ భాస్కర్ బాబు, ఏఈ సాంబ శివుడు, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## పింఛా నుంచి నీటి విడుదల



నీటిని దిగువకు విడుదల చేసిన అధికారులు

**సుండుపల్లె/రాయచోటి :** సుండుపల్లె మండల పరిధిలో ఉన్న పింఛా ప్రాజెక్టు దిగువ ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాజెక్ట్ ఇంజనీరు బి.నాగేంద్ర నాయక్ హెచ్చరించారు. గురువారం రాత్రి ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు పింఛా ప్రాజెక్టుకు 750 క్యూసెక్కులు వరద రానుందని ఈ కారణంగా గురువారం రాత్రి 9 గంటల నుంచి 1270 క్యూసెక్కుల నీటిని దిగువకు వదలనున్నట్లు పేర్కొన్నారు. దిగువ ప్రాంతలైన ముడుంపాడు, రాయవరం, కురవపల్లితోపాటు నదీ పరివాహక ప్రాంతాలలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మనవి చేశారు. వరద అధికమై ప్రాజెక్టులోకి నీటి ప్రవాహం ఎక్కువైతే గేటు మరింత ఎత్తే అవకాశం ఉందని తెలియజేశారు. ప్రజలు ఎవరూ ఏరు దాటే ప్రయత్నం చేయవద్దని ఆయన హెచ్చరించారు.